ఘనంగా అమరుడు పోలీస్ కిష్టయ్య వర్ధంతి

భూపాలపల్లిలో నివాళులర్పిస్తున్న ముదిరాజ్‌లు

కృష్ణకాలనీ/గణపురం/ములుగురూరల్, డిసెంబర్ 1 : తెలంగాణ మలిదశ ఉద్యమ అమరుడు, స్వరాష్ట్ర సాధనలో ఆత్మ బలిదానం చేసుకున్న పోలీస్ పుట్ట కొక్కుల కిష్టయ్య 15వ వర్ధంతి వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నీళ్లు, నిధులు, నియామకాల కోసం జరుగుతున్న తెలంగాణ మలిదశ ఉద్యమంలో తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ప్రాణత్యాగం చేసిన కిష్టయ్యను తెలంగాణ తొలి అమరుడిగా గుర్తించాలని ముదిరాజ్ మహాసభ నాయకులు అన్నారు. భూపాలపల్లి జిల్లా కేంద్రంలో ముదిరాజ్ మహాసభ సంఘాల జిల్లా అధ్యక్షుడు ఆకుల సుభాష్, జోరుగా సదయ్య, జిల్లా చీఫ్ ప్రమోటర్ చిలుకల పాణి, నాయకులు వేముల రాజమౌళి, ఎదుల శ్రీధర్, సందీప్, గంట గోపాల్, సొసైటీ అధ్యక్షులు తూటి దేవేందర్, జోరు వెంకటేశ్వర్లు, అల్లం స్వామి, పిట్టల లింగయ్య, సాంబయ్య, అల్లం రవి, తీగల సారంగపాణి, చెక్క కుమారస్వామి, జంగ రాంబాబు, కొమురయ్య పాల్గొన్నారు. గణపురం మండల కేంద్రంలో ముదిరాజ్ మహాసభ మండల అధ్యక్షుడు బోయిని సాంబయ్య, మత్స్యశాఖ జిల్లా డైరెక్టర్ చాడ కిష్టస్వామి, గణపసముద్రం మత్స్యశాఖ చైర్మన్ మల్లవేణి రాజు, మాజీ చైర్మన్ మునిగాల రమేష్, మత్స్యశాఖ కార్యదర్శి కొంతం గణపతి, నాయకులు పరుషబోయిన రాజయ్య, బోళ్ల బాలకృష్ణ, ఒద్దుల రాందాసు, తేలు రాంచందర్, పెండ్యాల రవి, బోళ్ల లింగయ్య పాల్గొన్నారు. ములుగు జిల్లా కేంద్రంలో ముదిరాజ్ మహాసభ జిల్లా అధ్యక్షుడు బొల్లు దేవేందర్, ఎస్సై-3 లక్ష్మారెడ్డి, నాయకులు వెంకటమల్లయ్య, సాద రఘు, చిటమట రఘు, వెంకన్న, రవి, శంకర్, చేరాలు, అశోక్, మొగిలి, వెంకటేశ్ పాల్గొన్నారు.

ఐక్యతతోనే బీసీలకు రాజ్యాధికారం

రిటైర్డ్ ఐఏఎస్ అధికారి, బీసీ ఇంటలెక్చువల్ కమిటీ రాష్ట్ర చైర్మన్ చిరంజీవులు

రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న టీ చిరంజీవులు

కృష్ణ కాలనీ, డిసెంబర్ 1 : బీసీ ఉద్యమాన్ని ఐక్యతతో గడపగడపకూ తీసుకెళ్తే రాష్ట్రంలో బీసీల రాజ్యాధికారం వస్తుందని రిటైర్డ్ ఐఏఎస్ అధికారి, బీసీ ఇంటలెక్చువల్ కమిటీ రాష్ట్ర చైర్మన్ టీ చిరంజీవులు అన్నారు. బీసీ ఇంటలెక్చువల్ జయశంకర్ భూపాలపల్లి జిల్లా కమిటీ నాయకులు పైడిపల్లి రమేశ్, దాసరి కిరణ్‌కుమార్ ఆధ్వర్యంలో ఆదివారం జిల్లా కేంద్రంలోని కాంట్రాక్ట్ అసోసియేషన్ కార్యాలయంలో బీసీ ఇంటలెక్చువల్ రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి రిటైర్డ్ ఐఏఎస్ అధికారి చిరంజీవులు, బీఆర్‌ఎస్ పార్టీ మంథని నియోజకవర్గ ఇన్‌చార్జి పుట్ట మధూకర్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. చిరంజీవులు మాట్లాడుతూ 61శాతం బీసీ జనాభా ఉండి రాష్ట్రంలో రాజ్యాధికారం అందుకోలేకపోవడం బాధాకరమన్నారు. దీనికి బీసీల్లో సఖ్యత లేకపోవడమే కారణమన్నారు. 77యేళ్లుగా బీసీలు రిజర్వేషన్లను కోల్పోయారన్నారు. జనాభా ప్రతిపాదికన రిజర్వేషన్లు ఇస్తే వేలమంది బీసీబిడ్డలకు ప్రభుత్వ ఉద్యోగాలు వస్తాయన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ అభ్యర్థులకు ఓటు వే యాలన్నారు. రాజ్యాధికారం వస్తేనే బీసీలు బానిసత్వం నుంచి బయటపడతారన్నారు.

ఐక్యతతో హక్కులు సాధించుకోవాలి
పుట్ట మధుకర్

రాష్ట్రంలోని బీసీలంతా ఏకతాటిపైకి వచ్చి తమ హక్కులను సాధించుకోవాలని బీఆర్‌ఎస్ పార్టీ మంథని నియోజకవర్గ ఇన్‌చార్జి పుట్ట మధూకర్ అన్నారు. అగ్రకులస్తులు ఏతప్పు చేసినా దానిని వేలెత్తి చూపరని, ఏ తప్పూ చేయకున్నా మన బీసీలే మన మీద చాడీలు చెబుతూ అగ్రకులస్తులకు వత్తాసు పలుకుతారన్నారు. మంథనిలో అగ్రకుల ఎమ్మెల్యే అరాచకాలు తీవ్రతరంగా ఉన్నాయని, వాటిని ప్రశ్నించే నాథుడే లేడన్నారు. ఇప్పటికైనా బీసీలంతా ఏకమైతే రాష్ట్రంలో రాజ్యాధికారం సాధించవచ్చని తెలిపారు. కార్యక్రమంలో పీసీసీ సభ్యులు గాజర్ల అశోక్, బీసీ సంఘాల నాయకులు శ్రీపతి ప్రభాకర్, చంద్రగిరి శంకర్, తాటి వెంకటేశ్వర్లు, బడితల స్వామి, ఖ్యాతరాజ్ సాంబమూర్తి, పున్నం రవి, శేఖర్‌నాని, గోవర్ధన్, సంపత్, వీ పాపయ్య, రాజేందర్, మహిళా, యూత్ నాయకులు పాల్గొన్నారు.

2కే రన్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ దివాకర

ఆరోగ్యానికి క్రీడలు దోహదం : కలెక్టర్ దివాకర

ములుగురూరల్, డిసెంబర్ 1 : ఆరోగ్యానికి క్రీడలు, వ్యాయామం, నడక ఎంతో దోహదపడుతాయని కలెక్టర్ టీఎస్ దివాకర అన్నారు. ప్రజాపాలన విజయోత్సవాల కార్యక్రమంలో భాగంగా ఆదివారం ఆర్అండ్‌బీ గెస్ట్‌హౌజ్ నుంచి ప్రభుత్వ జూనియర్ కళాశాల వరకు 2కే రన్‌ను నిర్వహించగా కలెక్టర్ హాజరై మాట్లాడారు. డీపీవో ఒంటేరు దేవరాజు, మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ మోహన్‌లాల్, తుల రవి, ఎంఈవో శ్రీనివాసులు, ఎంపీడీవో రామకృష్ణ పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయిలో ప్రతిభ

ములుగురూరల్, డిసెంబర్ 1 : 10వ రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో ములుగు జిల్లా క్రీడాకారులు ప్రతిభ కనబర్చారని అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్‌రెడ్డి తెలిపారు. ఓవరాల్‌గా రాష్ట్ర స్థాయిలో 2వ స్థానం సాధించారని తెలిపారు. మంచిర్యాలలో జరిగిన పోటీల్లో జిల్లాకు చెందిన మనోహర్, భీమయ్య, దేవయ్య, శివకుమార్, ప్రదీప్, సంజన, అంజి, ప్రవీణ్‌కుమార్, అమృతవర్షిణి అనే విద్యార్థులు పతకాలు సాధించారని ఆయన పేర్కొన్నారు.

అథ్లెటిక్స్ పోటీల్లో ఐదు మెడల్స్

ఏటూరునాగారం, డిసెంబర్ 1 : మంచిర్యాలలో నిర్వహించిన 10వ తెలంగాణ సబ్ జూనియర్ రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో ఏటూరునాగారం క్రీడాకారులు పాల్గొని ఐదు మెడల్స్ సాధించినట్లు కోచ్ పర్వతాల కుమారస్వామి తెలిపారు. పెద్దబోయిన సంజన, ఎం భీమయ్య, ఎం దేవయ్య, ఏ ప్రణీత్‌కుమార్ పాల్గొని ఐదు మెడల్స్ సాధించినట్లు తెలిపారు. అదేవిధంగా నిజామాబాద్‌లో జరుగుతున్న హ్యాండ్‌బాల్ పోటీలో మండలకేంద్రానికి చెందిన జాడి రాధిక పాల్గొని తృతీయ బహుమతి పొందినట్లు తెలిపారు.

పూర్తి స్థాయిలో తైబందీ ప్రకటించాలి

గోవిందరావుపేట, డిసెంబర్ 1 : లక్నవరం సరస్సు కింద ఉన్న నాలుగు ప్రధాన కాల్వలకు తైబందీ పూర్తిగా ప్రకటించాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి సామ చంద్రారెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలోని పస్రా సీపీఎం పార్టీ కార్యాలయంలో ఆదివారం సమావేశం నిర్వహించగా ఆయన పాల్గొని మాట్లాడారు. లక్నవరం సరస్సులో ప్రస్తుతం 30అడుగుల నీరు ఉన్న నేపథ్యంలో పూర్తి తైబందీ ప్రకటించవచ్చని అన్నారు. మురళి, మల్లారెడ్డి, రాజేశ్, రమేశ్, సీరజ్, సువర్ణలతోపాటు పలువురు ఉన్నారు.

సూరారంలో సీసీ కెమెరాలు ప్రారంభం

మహదేవపూర్, డిసెంబర్ 1 : ఒక్కో సీసీ కెమెరా వంద మంది పోలీసులతో సమానమని సీఐ రామచంద్రరావు అన్నారు. ఆదివారం మండల పరిధిలోని సూరారం గ్రామంలో పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను ఎస్సై పవన్‌కుమార్‌తో కలిసి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సీసీ కెమెరాలతోనే గ్రామాల్లో పటిష్ట నిఘా ఉంటుందన్నారు. అనుమానితులు గ్రామాల్లో సంచరిస్తే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు.

పాఠశాలల్లో విద్యా కమిషన్ సభ్యుడి తనిఖీ

అల్పాహారం భుజిస్తున్న ప్రొఫెసర్ విశ్వేశ్వర్‌రావు

చిట్యాల/టేకుమట్ల, డిసెంబర్ 1 : భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా విద్యా విధానాన్ని తీర్చిదిద్దడానికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రిటైర్డ్ ఐఏఎస్ అధికారి ఆకునూరి మురళి చైర్మన్‌గా, ముగ్గురు కమిటీ సభ్యులతో విద్యా కమిషన్‌ను ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. కాగా సభ్యులలో ఒకరైన ప్రొఫెసర్ విశ్వేశ్వర్‌రావు విద్యా ప్రమాణాలను అంచనా వేయడానికి ఆదివారం చిట్యాల మండలంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, టేకుమట్లలోని కేజీబీవీని ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థినులతో కలిసి అల్పాహారాన్ని భుజించారు. క్రీడాస్థలాన్ని, వంటశాల, భోజనశాల, స్టోర్ రూమ్, డార్మిటరీని పరిశీలించారు. పదో తరగతి, ఇంటర్ విద్యార్థులతో విద్యాపరమైన విషయాలను చర్చించారు. విద్యార్థుల వీక్లీ మెనూ, ఆహార పదార్థాలపై సంతృప్తి చెందినట్లు చెప్పారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ మాట్లాడుతూ పరిశీలించిన అంశాలను నమోదు చేసుకొని కమిషన్‌కు అందజేయనున్నట్లు తెలిపారు. ఆయన వెంట జిల్లా అధికారి రాజేందర్, జిల్లా బీసీ డెవలప్‌మెంట్ అధికారి శైలజ, ఎస్సీ డెవలప్‌మెంట్ అధికారి సునీత, ప్రిన్సిపాల్ భిక్షపతి ,కేజీబీవి స్పెషల్ ఆఫీసర్ స్వప్న పాల్గొన్నారు.

కోటగుళ్లలో కలెక్టర్ సతీమణి పూజలు

కోటగుళ్లలో కలెక్టర్ సతీమణి

గణపురం, డిసెంబర్ 1 : మండల కేంద్రంలోని కోటగుళ్లలో కార్తికమాస ఉత్సవాల్లో భాగంగా భూపాలపల్లి కలెక్టర్ రాహుల్‌శర్మ సతీమణి కాత్యాయని వారి కుటుంబ సభ్యులతో కలిసి ఆదివారం స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. పూజ అనంతరం ఆమె ఆలయ విశిష్టతను అడిగి తెలుసుకున్నారు. కోటగుళ్ల శిల్ప సంపద అద్భుతంగా ఉందని కొనియాడారు.

కొనుగోళ్లలో కోతలు అన్యాయం

ములుగురూరల్, డిసెంబర్ 1 : తాలు పేరుతో కొనుగోలు కేంద్రాల్లో ధాన్యంలో కోతలు విధించడం అన్యాయమని రాష్ట్ర రైతు సంఘం జిల్లా కన్వీనర్ ఎండీ అమ్జద్‌పాషా అన్నారు. ఆదివారం ములుగు జిల్లా కేంద్రంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన సందర్శించి రైతుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. అనంతరం ఈ నెల 13న జిల్లా కేంద్రంలో నిర్వహించతలపెట్టిన రైతు సంఘం జిల్లా మహాసభల కరపత్రాలను రైతులతో కలిసి ఆవిష్కరించారు. నాయకులు బోడ రమేశ్, శ్రీనివాస్, గౌర్రె అంకూస్, సదర్‌లాల్, దాసు, సమ్మయ్య, చంద్రమౌళి, సాంబయ్య, లక్ష్మి, కొమురక్క, స్వరూప పాల్గొన్నారు.

వ్యాధులు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

- అదనపు కలెక్టర్ విజయలక్ష్మి
- ఎయిడ్స్‌వ్యాధి నివారణపై అవగాహన ర్యాలీ

ర్యాలీని ప్రారంభిస్తున్న అడిషనల్ కలెక్టర్ విజయలక్ష్మి

కృష్ణ కాలనీ, డిసెంబర్ 1 : వ్యాధులబారిన పడకుండా ముందు జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా అదనపు కలెక్టర్ విజయలక్ష్మి అన్నారు. ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని భూపాలపల్లి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ఆదివారం జిల్లా కేంద్రంలో ఎయిడ్స్ వ్యాధి నివారణపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ముఖ్యఅతిథిగా అదనపు కలెక్టర్ విజయలక్ష్మి హాజరై జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. అనంతరం మున్సిపల్ కార్యాలయంలోని కౌన్సిల్ హాల్‌లో ఏర్పాటు చేసిన ప్రపంచ ఎయిడ్స్ డే వేడుకల్లో ఆమె మాట్లాడుతూ ప్రపంచంలో ఏ వ్యాధికైనా మందులు ఉన్నాయని, ఒక్క ఎయిడ్స్‌కు మాత్రం నివారణే మార్గమన్నారు. ప్రజలు వారు బాధపడుతున్న వ్యాధుల గురించి వైద్యుల దృష్టికి తీసుకెళ్తే వ్యాధి నివారణకు అవసరమయ్యే మందులు అందజేస్తారన్నారు. తద్వారా ప్రజలు ఆరోగ్యవంతమైన జీవితాన్ని గడుపుతారన్నారు. స్వచ్ఛంద సంస్థలు ఎయిడ్స్ వ్యాధి నిర్మూలనకు కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. డీఎంహెచ్‌వో డాక్టర్ మధుసూదన్ మాట్లాడుతూ జిల్లాలో గతంలో కంటే ఎయిడ్స్ వ్యాధిగ్రస్తుల సంఖ్య తగ్గిందన్నారు. యువత చెడు వ్యసనాలకు పోయి అనారోగ్యం పాలు కావద్దన్నారు. అనంతరం విధి నిర్వహణలో ప్రతిభ కనబరిచిన వైద్యసిబ్బందికి ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో వైద్యులు ఐఎంఏ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ కిరణ్‌కుమార్, ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ ఉమాదేవి, భూపాలపల్లి పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రోహిణి, దిశ అధికారి జ్యోతి, సీఎస్‌వో సారయ్య, మారి సంస్థ సభ్యులు గోపగాని సదానందం, సహా, భద్రయ్య, నిర్మల పాల్గొన్నారు.

కాటారంలో..

కాటారం : మండలకేంద్రంలో వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ఆదివారం ఎయిడ్స్ వ్యాధిపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. వైద్యాధికారి డాక్టర్ మౌనిక, వైద్యులు తిరుపతిరెడ్డి, ఏఎన్ఎం శ్యామలత, వైద్యసిబ్బంది, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

భూపాలపల్లిలో ప్రజాపాలన విజయోత్సవ వేడుకలు


మాట్లాడుతున్న ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

కృష్ణ కాలనీ, డిసెంబర్ 1 : జిల్లా కేంద్రంలోని సుభాష్ కాలనీలో గల సింగరేణి మినీ ఫంక్షన్ హాల్‌లో ఆదివారం ప్రజాపాలన విజయోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు, కలెక్టర్ రాహుల్‌శర్మ ముఖ్యఅతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలను ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ గెలిచిన 100రోజుల్లోనే ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చామని, భూపాల్‌పల్లి నియోజకవర్గ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్నానన్నారు. కలెక్టర్ రాహుల్‌శర్మ మాట్లాడుతూ ప్రజాపాలన విజయోత్సవ వేడుకలు డిసెంబర్ 9వ తేదీ వరకు జరుగుతాయని తెలిపారు. ఒక్కో శాఖ ఆధ్వర్యంలో ఒక్కరోజు వేడుకలు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో ట్రేడ్ కార్పొరేషన్ చైర్మన్ ఐత ప్రకాశ్‌రెడ్డి, జిల్లా అడిషనల్ కలెక్టర్ విజయలక్ష్మి, డీపీఆర్వో శ్రీనివాస్, జిల్లాలోని అన్ని శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

వ్యాసరచన పోటీలు

మల్హర్, డిసెంబర్ 1 : మల్హర్ మండల విద్యాధికారి లక్ష్మణ్‌బాబు ఆధ్వర్యంలో ఆదివారం మండలంలోని వివిధ పాఠశాలల్లోని 8,9,10 తరగతి విద్యార్థులకు 'పునరుత్పాదక ఇంధన వనరులు' అనే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. 29మంది విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొన్నారు. ఇందులో మల్లారం జడ్పీహెచ్ఎస్‌కు చెందిన 9వ తరగతి విద్యార్థిని కే వర్షిణి మొదటి బహుమతి సాధించగా, రెండో స్థానంలో కేజీబీవీ పాఠశాలలో 10వ తరగతి చదివే జే శ్రీనిధి, మూడో స్థానంలో తాడిచెర్ల జడ్పీహెచ్ఎస్‌కు చెందిన పీ సాత్విక నిలిచారు. ఉపాధ్యాయులు మురళీమనోహర్‌రావు, మహేశ్, సంధ్య, సుఖేందర్, సంపత్, సమ్మయ్య పాల్గొన్నారు.

విద్యా వ్యవస్థపై ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదు


విద్యార్థులతో మాట్లాడుతున్న రమేశ్‌గౌడ్

చిట్యాల/మొగుళ్లపల్లి, డిసెంబర్ 1 : రాష్ట్రంలో విద్యా వ్యవస్థపై కాంగ్రెస్ ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని బీఆర్‌ఎస్వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మోటపోతుల రమేశ్‌గౌడ్ అన్నారు. ఆదివారం చిట్యాల మండల కేంద్రంలోని గురుకుల పాఠశాల, ఎస్సీ, బీసీ వసతి గృహాలు, మొగుళ్లపల్లి మండలంలోని ఎంజేపీ, కస్తూర్బా, ఎస్సీ, బీసీ వసతి గృహాలను సందర్శించారు. ఈ సందర్భంగా రమేశ్‌గౌడ్ మాట్లాడుతూ బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో విద్యార్థులకు మెరుగైన విద్య కోసం గురుకులాల వ్యవస్థను ఏర్పాటు చేసి విద్యా వ్యవస్థను ప్రోత్సహించారని అన్నారు. ప్రస్తుత కాంగ్రెస్ సీఎం రేవంత్‌రెడ్డి విద్యా రంగాన్ని నిర్లక్ష్యం చేస్తున్నారని అన్నారు. వసతి గృహాల్లో సిబ్బంది కొరత, విద్యార్థులకు నాసిరకం ఆహారాన్ని అందించడం వల్ల అస్వస్థతకు గురవుతున్నారన్నారు. చలికాలంలో వేడి నీరు లేక, సరైన దుప్పట్లు అందక అవస్థలు పడుతున్నారన్నారు. ప్రభుత్వం స్పందించి సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఆయన వెంట చిట్యాలలో బీఆర్‌ఎస్వీ జిల్లా నాయకులు కట్కూరి రాజేందర్, అల్లాడి శ్రీకాంత్, మొగుళ్లపల్లిలో నాయకులు అల్లాడి శ్రీకాంత్, కట్కూరి రాజేందర్ ఉన్నారు.

చిన్న కాళేశ్వరం పనులను అడ్డుకున్న రైతులు

కాటారం, డిసెంబర్ 1 : కాటారం మండల కేంద్రంలోని సర్వే నంబర్ 501లో జరుగుతున్న చిన్న కాళేశ్వరం పైప్‌లైన్ పనులను ఆదివారం రైతులు అడ్డుకున్నారు. 8మంది రైతులు తాము కోల్పోయిన భూమికి పరిహారం డబ్బులు రాలేదని, డబ్బులు వచ్చేంత వరకు పనులు జరుగనివ్వమని వాగ్వాదానికి దిగారు. పనులను నిలిపివేయించి జేసీబీని పంపించారు. రైతులు దుర్గం తిరుపతి, గజ్జల ధర్మయ్య, గజ్జల రాజయ్య, దుర్గం రాజేశం, సాంబమూర్తి పాల్గొన్నారు.

కార్యకర్తలకు అండగా బీఆర్‌ఎస్ : పుట్ట మధు


చెక్కు అందజేస్తున్న పుట్ట మధు

మల్హర్, డిసెంబర్ 1 : మండలంలోని రుద్రారం గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ పార్టీ కార్యకర్త దుద్దిళ్ల నిశాంత్ విద్యుదాఘాతంతో మృతి చెందగా రూ.2లక్షల బీఆర్‌ఎస్ పార్టీ సభ్యత్వ ప్రమాద బీమా చెక్కును ఆదివారం అందజేశారు. మంథని పట్టణంలోని రాజాగృహాలో దుద్దిళ్ల నిశాంత్ కుటుంబ సభ్యులకు రూ.2లక్షల చెక్కును మంథని నియోజకవర్గ బీఆర్‌ఎస్ పార్టీ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు అందజేశారు. మండలాధ్యక్షుడు రాఘవరెడ్డి, నారాయణ ఉన్నారు.

మృతి చెందిన ఆటో డ్రైవర్ కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా చెల్లించాలి

ఆటో యునైటెడ్ ఓనర్స్ అండ్ డ్రైవర్స్ యూనియన్ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు మంతెన మహేశ్

మహదేవపూర్, డిసెంబర్ 1 : ఆర్టీసీ ఫ్రీ పథకంతో ఉపాధిలేక మృతి చెందిన ఆటో డ్రైవర్ కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం రూ.25లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించి ఆదుకోవాలని ఆటో యునైటెడ్ ఓనర్స్ అండ్ డ్రైవర్స్ యూనియన్ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు మంతెన మహేశ్ డిమాండ్ చేశారు. ఆదివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం మ్యానిఫెస్టోలో ప్రవేశపెట్టిన విధంగా ఆటో కార్మికులకు రూ.వెయ్యి కోట్లతో సంక్షేమ బడ్జెట్ ఏర్పాటు చేయాలన్నారు. అనంతరం మండల కేంద్రంలో మహదేవపూర్ ఆటో జేఏసీ కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఎండీ తాజ్‌హుస్సేన్, ఉపాధ్యక్షుడిగా ఎండీ సైబొద్దిన్, ప్రధాన కార్యదర్శిగా పొట్లపల్లి రవికుమార్, అధికార ప్రతినిధిగా గంప శ్యామ్, కోశాధికారిగా కారెంగుల రాము, కార్యదర్శిగా కుమ్మరి దేవేందర్, కార్యవర్గ సభ్యులుగా ఆరుగురిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో ఆటో డ్రైవర్లు, ఓనర్లు పాల్గొన్నారు.

డబుల్ బెడ్ రూమ్‌లు కేటాయించాలి

జై మహాభారత్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎస్పీకే సాగర్


మాట్లాడుతున్న ఎస్పీకే సాగర్

కృష్ణ కాలనీ, డిసెంబర్ 1: జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని భాస్కర్ గడ్డలో నిర్మించిన 416 డబుల్‌బెడ్ రూమ్ ఇండ్లను తక్షణమే నిరుపేద కుటుంబాలకు అందించాలని జై మహాభారత్ పార్టీ తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎస్పీకే సాగర్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల వద్ద ధర్నా చేస్తున్న లబ్ధిదారులకు జై మహాభారత్ పార్టీ నాయకులు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్పీకే సాగర్ మాట్లాడుతూ గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం జిల్లా కలెక్టర్ సమక్షంలో 392మంది ఇండ్లు లేని నిరుపేదలను అర్హులుగా గుర్తించి డ్రా పద్ధతిలో ఇంటి నంబర్, బ్లాక్ నంబర్ ఇచ్చి డబుల్‌బెడ్ రూమ్ ఇళ్లను కేటాయించిందన్నారు. గత ప్రభుత్వం అర్హులను గుర్తించినప్పటికీ ఎందుకు వాటిని కేటాయించడం లేదని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావును ప్రశ్నించారు. రేపు రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ చిత్తుగా ఓడిపోవడం ఖాయమన్నారు. మూడు నెలల క్రితం సమగ్ర సర్వే చేయిస్తానని చెప్పిన జిల్లా కలెక్టర్ ఇప్పటివరకు ఎటువంటి సర్వే చేయించారో ప్రజలకు తెలుపాలన్నారు. స్థానిక ఎమ్మెల్యే గతంలో ఎంపిక చేసిన 392మంది అర్హులకు తక్షణమే డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల సర్టిఫికెట్లు ఇచ్చి ఆదుకోవాలన్నారు.

హరికృష్ణకు సీఎస్సీ బెస్ట్ సపోర్టింగ్ ఇంటర్‌ప్రెన్యూర్‌షిప్ అవార్డు

అవార్డు అందుకుంటున్న హరికృష్ణకుమార్

కృష్ణ కాలనీ, డిసెంబర్ 1 : హైదరాబాద్‌లోని టీహబ్‌లో ఆదివారం జరిగిన బ్యాక్‌వర్డ్ క్లాసెస్ చాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ టీ-కన్సల్ట్ (బిక్కి) ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి సదస్సులో భూపాలపల్లి జిల్లా కేంద్రానికి చెందిన సీఎస్సీ సీనియర్ మేనేజర్ బేతోజు హరికృష్ణకుమార్ సీఎస్సీ బెస్ట్ సపోర్టింగ్ ఇంటర్‌ప్రెన్యూర్‌షిప్ అవార్డు అందుకున్నారు. ఈ మేరకు మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు చేతుల మీదుగా హరికృష్ణ ప్రాతినిధ్యం వహిస్తున్న మోడల్ సీఎస్సీ ప్రాజెక్ట్‌కు ఈ అవార్డు అందజేసి, శాలువాతో సత్కరించారు. కార్యక్రమానికి రాష్ట్ర బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్, ఎమ్మెల్సీ, శాసన మండలి ప్రతిపక్ష నేత సిరికొండ మధుసూదనాచారి, మధ్యప్రదేశ్ రాష్ట్ర ప్రిన్సిపల్ సెక్రటరీ పరికిపండ్ల నరహరి, టిటా గ్లోబల్ ప్రెసిడెంట్ సందీప్ మక్తాల, బిక్కి ప్రెసిడెంట్ చేరేలా నారాయణ, జనరల్ సెక్రటరీ డా.దాసరి కిరణ్, వివిధ కంపెనీల పారిశ్రామికవేత్తలు, అధికారులు, సీఎస్సీ ప్రతినిధులు, వీఎల్ఈలు పాల్గొన్నారు.

గ్రామాల్లో దుప్పట్లు పంపిణీ

వెంకటాపురం(నూగూరు), డిసెంబర్ 1 : మండల పరిధిలోని మల్లాపురం, కపవానిగుంపు గ్రామాల్లో చేయూత స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో నిరుపేద కుటుంబాలకు దుప్పట్లు, చీరలు, బట్టలను పంపిణీ చేశారు. మాజీ జడ్పీటీసీ పాయం రమణ చేతుల మీదుగా 50కుటుంబాలకు ఈ సాయం అందజేశారు. కార్యక్రమంలో స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు చిడెం సాయిప్రకాశ్ తదితరులు ఉన్నారు.

విద్యార్థులు ఇష్టంతో చదవాలి

తాడ్వాయి/వాజేడు/మంగపేట/చిట్యాల, డిసెంబర్ 1 : విద్యార్థులు కష్టంగా కాకుండా ఇష్టంగా చదివినప్పుడే ఉన్నత శిఖరాలను అధిరోహిస్తారని అధికారులు అన్నారు. ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా పాఠశాలల్లో ఆదివారం విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు.

మహాసభలను విజయవంతం చేయాలి

మంగపేట, డిసెంబర్ 1 : ఈనెల 22, 23 తేదీల్లో ములుగు జిల్లా కేంద్రంలో నిర్వహించనున్న తుడుందెబ్బ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని తుడుందెబ్బ జిల్లా అధ్యక్షుడు వట్టం జనార్ధన్ పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో ఆదివారం మహాసభలకు సంబంధించిన పోస్టర్లు ఆవిష్కరించారు. కార్యక్రమంలో జాతీయ కో కన్వీనర్ పొడెం రత్నం, రాష్ట్ర ఉపాధ్యక్షుడు కబ్బాక శ్రావణ్‌కుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శి చందా మహేశ్, మండల ఉపాధ్యక్షుడు ఆగబోయిన సాయికుమార్, జబ్బ వంశీ కృష్ణ పాల్గొన్నారు.

పీఏసీఎస్ ద్వారా ధాన్యం కొనుగోలు చేయాలి

కాటారం, డిసెంబర్ 1 : స్థానికంగా పీఏసీఎస్ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని వెంటనే ప్రారంభించి వడ్ల సేకరణ చేయాలని పలువురు దామెరకుంట రైతులు డిమాండ్ చేశారు. ఆదివారం పలువురు రైతులు వడ్ల కుప్పలు పోసిన ప్రదేశంలో వినతిపత్రంతో నిరసన తెలిపారు. రైతులకు మేలు జరిగేలా మంత్రి శ్రీధర్‌బాబు అధికారులను ఆదేశించాలని కోరారు. కార్యక్రమంలో రైతులు రాజిరెడ్డి, సాయి, తిరుపతి, మల్లయ్య, ప్రభాకర్, తిరుపతిరెడ్డి, శ్రీనివాస్, తిరుపతి, చంద్రయ్య, లచ్చన్న, మధు, లక్ష్మయ్య, మధుసూదన్‌రెడ్డి, రాజమల్లు ఉన్నారు.

కార్యాలయాలను కార్మికులకు అప్పగించాలి

మంగపేట, డిసెంబర్ 1 : కమలాపురంలో బిల్ట్ కర్మాగారం నడిచినప్పుడు కార్మికుల సహకారంతో నిర్మించిన యూనియన్ కార్యాలయాలను కార్మికులకు అప్పగించాలని పలువురు సీనియర్ కార్మికులు కోరారు. ఈ మేరకు ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. జేఏసీ నాయకులు, బిల్ట్ డీజీఎం కేశవరెడ్డి బిల్ట్ గేటు ముందుకు వచ్చి కార్మికులకు జరిగిన సెటిల్‌మెంట్ విషయాలను వెల్లడించాలన్నారు. గూడ యాదగిరి, గుల్లగట్టు విజయరావు, బుచ్చయ్య, బాలగాని కొమరయ్య పాల్గొన్నారు.

మీడియాపై పోలీసుల ఆంక్షలు

అడవిలో ఇబ్బంది పడిన విలేకర్లు

ఏటూరునాగారం, డిసెంబర్ 1 : మండలంలోని చెల్పాక అటవీ ప్రాంతంలో జరిగిన ఎన్‌కౌంటర్ కవరేజీకి వెళ్లిన మీడియా పోలీసుల ఆంక్షలతో ఇబ్బంది పడ్డారు. ఆదివారం తెల్లవారుజామున ఎన్‌కౌంటర్ జరిగిన సమాచారం అందుకున్న ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియాకు చెందిన సుమారు 25మంది ఉదయం పది గంటలకు పోలకమ్మవాగు సమీపంలోకి చేరుకున్నారు. అదే సమయంలో జిల్లా ఎస్పీ కూడా అక్కడికి వచ్చారు. కొద్దిసేపటి తర్వాత స్పాట్ వద్దకు వెళ్లడానికి ఎస్సైతో రమ్మని చెప్పినా పోలీసులు తర్వాత పట్టించుకోలేదు. ఇక మధ్యాహ్నం 2గంటల ప్రాంతంలో ఏటూరునాగారం ఎస్సైతోపాటు తహసీల్దార్లు ఘటనా స్థలానికి వెళ్తున్న క్రమంలో కూడా మీడియా రావడానికి అనుమతి ఇవ్వలేదు. ఎట్టకేలకు అడవిలో ఆరు కిలోమీటర్ల దూరం నడిచి ఎన్‌కౌంటర్ జరిగిన ప్రదేశానికి వెళ్లగా అక్కడ విధుల్లో ఉన్న వేరే జిల్లా పోలీస్ ఆఫీసర్ కూడా ఆంక్షలు విధించి రావడానికి నిరాకరించారు. ఘటనా స్థలానికి రాకుండా ఇద్దరు కానిస్టేబుల్స్‌ను కాపలా పెట్టారు. దీంతో సాయంత్రం వరకు అక్కడే ఉండి అడవిలో చీకటి పడుతుండగా విలేకర్లు వెనుదిరిగి వచ్చారు.

కుదురుపల్లిలో మళ్లీ క్షుద్ర పూజల కలకలం

మహదేవపూర్, డిసెంబర్ 1 : మండలంలోని కుదురుపల్లి వాగులో మళ్లీ క్షుద్రపూజలు చేసిన ఆనవాళ్లు కలకలం రేపాయి. నవంబర్ 10న ఇదే వాగులో హనుమకొండకు చెందిన వ్యక్తులు క్షుద్ర పూజలు చేస్తుండగా గమనించిన స్థానికులు పట్టుకొని దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించిన విషయం తెలిసిందే. తాజాగా ఆదివారం ఇదే వాగులో గుర్తు తెలియని వ్యక్తులు క్షుద్ర పూజలు చేసి, అక్కడే జంతు బలి చేసి వదిలివెళ్లిన ఆనవాళ్లను స్థానిక ప్రజలు గుర్తించి అధికారులకు సమాచారం అందించారు.

ఎన్‌కౌంటర్ నేపథ్యంలో వాహన తనిఖీలు

సమ్మక్క బరాజ్ వద్ద ప్రయాణికుల వివరాలు తీసుకుంటున్న ఎస్సై వెంకటేశ్

వాజేడు/కన్నాయిగూడెం/ వెంకటాపురం(నూగూరు), డిసెంబర్ 1 : ఏటూరునాగారం చెల్పాక అడవుల్లో ఆదివారం జరిగిన ఎన్‌కౌంటర్ నేపథ్యంలో వాజేడు, కన్నాయిగూడెం, వెంకటాపురం (నూగూరు) మండలాల పోలీసులు అప్రమత్తమయ్యారు. వాజేడు మండలంలోని కొప్పుసూరు, కన్నాయిగూడెంలోని సమ్మక్క బరాజ్‌తోపాటు రహదారిపై, వెంకటాపురం(నూగూరు) మండల పరిధిలోని జెల్లా కాలనీ తదితర గ్రామాల్లోని ప్రధాన రహదారిపై వాహనాలను తనిఖీ చేశారు. అనుమానితులను విచారించారు. ఎస్సైలు కొప్పుల తిరుపతిరావు, వెంకటేశ్ సీఆర్పీఎఫ్, సివిల్ పోలీసులు పాల్గొన్నారు.

మావోయిస్టులకు వ్యతిరేకంగా వెలసిన కరపత్రాలు

వాజేడు/వెంకటాపురం(నూగూరు), డిసెంబర్ 1 : వాజేడు మండలంలోని కొప్పుసూరు, గుండ్లవాగు బ్రిడ్జి, మొరుమూరుకాలనీ, ప్రగళ్లపల్లి, పాయబట్ల, వెంకటాపురం(నూగూరు) మండల పరిధిలోని పాలెం, పాత్రాపురం, వీరభద్రవరం తదితర గ్రామాలకు వెళ్లే ప్రధాన రహదారి పక్కన ఆదివారం ఉదయం మావోయిస్టులకు వ్యతిరేకంగా ఆదివాసీ ఐక్యవేదిక, ఆదివాసీ యువజన సంఘాల పేరిట కరపత్రాలు వెలిశాయి. పెనుగోలు గ్రామానికి చెందిన పేరూరు గ్రామపంచాయతీ కార్యదర్శి ఉయిక రమేశ్, పశువుల కాపరి ఉయిక అర్జున్‌లను ఇటీవల ఇన్‌ఫార్మర్ల నెపంతో గొడ్డళ్లతో నరికి చంపిన మావోయిస్టులకు వ్యతిరేకంగా ఈ కరపత్రాలు వెలిశాయి. మావోయిస్టులకు ఆదివాసీల ప్రాణాలం టే లెక్కలేదా? అమాయక ఆదివాసీలను భయపెట్టి సరుకులు, సామగ్రి తెప్పించుకుని తిరిగి వారి ప్రాణాలను తీస్తున్నారని కరపత్రాల్లో పేర్కొన్నారు. ఇది మీకేంతవరకు న్యాయమని? ఆ కరపత్రంలో ప్రశ్నించారు. గిరిజన బిడ్డలారా ఇలాంటి బెదిరింపులకు భయపడొద్దు, మావోయిస్టులకు సహకరించొద్దని కరపత్రాల్లో పేర్కొన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

సెప్టిక్ ట్యాంక్ క్లినర్

SepTeK

★ సెప్టిక్ ట్యాంక్ క్లినర్ నూతన సాంకేతిక పరిజ్ఞానంతో గల్ఫర్ మిషన్ ద్వారా సెప్టిక్ ట్యాంక్ క్లీన్ చేయబడును. డి.ఎస్. రావు. Cont: 9849145043, 9866584455.
NTW-326503

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classified Ads
Please Contact...
9182777552
HANAMKONDA
9182777563
9182777961
WARANAGAL
9182777556
JAYASHANKAR BHUPALPALLY
9182777559
MULUGU
9182777135
MAHABUBABAD
9182777557
JANGAON
9182777565

నాణ్యమైన వంటకాలతో సంపూర్ణ ఆరోగ్యం

హనుమకొండ డీఎంహెచ్‌వో అల్లెం అప్పయ్య


వంటకాలను పరిశీలిస్తున్న హనుమకొండ డీఎంహెచ్‌వో అప్పయ్య

ములుగురూరల్,డిసెంబర్ 1 : నాణ్యమైన వంటకాలతో సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని ములుగు జిల్లా వాసి, హనుమకొండ డీఎంహెచ్‌వో డాక్టర్ అల్లెం అప్పయ్య అన్నారు. ములుగు జిల్లా కేంద్రంలోని బ్రిలియంట్ పాఠశాల ఆవరణలో ఆదివారం హెచ్‌పీ గ్యాస్ ఏజెన్సీ ఆధ్వర్యంలో మహిళలకు వంటల పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో పలువురు మహిళలు గ్యాస్‌పై వివిధ వంటకాలు చేపట్టగా అప్పయ్య ముఖ్య అతిథిగా హాజరై వంటకాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో అప్పయ్య మాట్లాడుతూ మహిళలు సంపూర్ణ ఆరోగ్యానికి కుటుంబ సభ్యులకు పోషకవిలువతో కూడిన వంటకాలను చేసిపెట్టాలని సూచించారు. న్యాయనిర్ణేతగా బీసీ బాలుర హాస్టల్ వార్డెన్ మానస వ్యవహరించారు. ఆరోగ్యానికి పోషకాలను అందించే వంటకాలు చేపట్టిన ముగ్గురు మహిళలకు హెచ్‌పీ గ్యాస్ స్టవ్‌లను బహుమతులుగా అందించారు. డీలర్ ప్రవీణ్‌కుమార్, లక్ష్మి గ్యాస్ ఏజెన్సీ సిబ్బంది చంద్రప్రకాశ్‌రెడ్డి, ఇతర గ్యాస్ ఏజెన్సీల సిబ్బంది రాజేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అప్పయ్యకు సన్మానం..

ములుగు జిల్లా వైద్యాధికారిగా సుదీర్ఘకాలం పనిచేసి ఇటీవల బదిలీపై హనుమకొండ డీఎంహెచ్‌వోగా వెళ్లిన డాక్టర్ అల్లెం అప్పయ్యకు ఆదివారం ఆదివాసీ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో ఘనసన్మానం చేశారు. ముఖ్యఅతిథిగా గ్రంథాలయ చైర్మన్ బానోత్ రవిచందర్ హాజరయ్యారు. కార్యక్రమంలో జిల్లా సాధన సమితి అధ్యక్షుడు ముంజాల భిక్షపతి, ఆదివాసీ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు మంకిడి రవి, గొల్లపల్లి రాజేందర్‌గౌడ్, రేవంత్‌యాదవ్, రవికాంత్, రామచందర్, జంపాల రవీందర్, ఆదివాసీ ఉద్యోగ సంఘం నాయకులు, ఏజెన్సీ ప్రాంతవాసులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

భూపాలపల్లిలో..

కృష్ణ కాలనీ, డిసెంబర్ 1 : కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా కేంద్రంలో ఆదివారం ఆయిల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ''మన వంటగది..మన బాధ్యత'' అనే కార్యక్రమంలో భాగంగా మహిళలకు జిల్లా స్థాయి కుకింగ్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలకు జిల్లాలోని వివిధ గ్రామాల నుంచి వందమంది మహిళలు హాజరయ్యారు. కార్యక్రమానికి స్థానిక 23వ వార్డు కౌన్సిలర్ మేకల రజిత ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. జిల్లా పౌరసరఫరాలశాఖ అధికారి శ్రీనాథ్ పర్యవేక్షణలో పోటీలు నిర్వహించారు. ప్రతిభ చూపిన ముగ్గురికి ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా గ్యాస్ డీలర్ల సంఘం అధ్యక్షుడు కంకటి రాజవీరు, సభ్యులు హెచ్‌పీ గ్యాస్ డీలర్ బాసాని శ్యాంకుమార్, అనిల్, వెంకటేశ్ పాల్గొన్నారు.